క్లుప్తంగా

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు



గుడివాడరూరల్: పట్టణంలో పలు అభివృద్ధి పనులకు రూ.8 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఏలూరు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంకేతిక అనుమతుల కోసం ఇప్పటికే సీఆర్డీకి పంపామన్నారు. అనుమతులు మంజూరైన మూడు వారాల్లోపు పనులను ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్, ఎంఈ ఎఎస్ఎన్ ప్రసాద్, డిఈలు సతీష్‌చంద్ర, వరప్రసాద్, శివాజీ పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి



గుడివాడరూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకుని ప్రయాణించాలని ట్రాఫిక్ ఎస్ఐ పి.నాగరాజు అన్నారు. పట్టణంలోని బస్టాండ్, ఏలూరురోడ్డు, బంటుమిల్లిరోడ్ తదితర ప్రాంతాల్లో హెల్మెట్ వినియోగంపై వాహనదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగిన సమయంలో తలెత్తే ఇబ్బందులను వివరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్స్ చింతా రామ చంద్రరావు, నాగరాజు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



మండవల్లి: నాగ పంచమి పురస్కరించుకుని స్థానిక శ్రీ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని మందిరం వద్ద ఉన్న పుట్టలో భక్తులు పాలుపోశారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



మండవల్లి: తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని సర్పంచ్ మెండా ఝాన్సీ అన్నారు. మండవల్లిలోని వివిధ ప్రదేశాల్లో పారిశుద్ధ్య పనులను సర్పంచ్ మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొడాలి సురేష్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ మంగళవారం తెలిపారు. మండలంలోని వివిధ సమస్యలపై చర్చించేందుకు ఈ సమావేశానికి అధికార, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

మొవ్వ ఎంపీడీఓగా శ్రీనివాసరావు



మొవ్వ: మొవ్వ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పరిపాలన అధికారి నూతులపాటి శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. మొవ్వ ఎంపీడీఓ డి.సుహాసిని బాపట్లలో నెల రోజులు పాటు నిర్వహించే శిక్షణ తరగతులకు హాజరవటంతో ఈయన ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు.

రైతులే సమష్టిగా కదిలారు

పూడిక తొలగింపునకు శ్రీకారం



పమిడిముక్కల: కురుస్తున్న వర్షాలకు మండలంలోని తాడంకి బాడవ పొలాలు ముంపునకు గురయ్యాయి. వరినాట్లు నీటిలో నానుతూ కుళ్లి పోతుతున్నాయి. కాలువలు పూడుకుపోయి నీరు పోయే మార్గం లేకపోవడంతో రైతులు సమష్టిగా కదిలి కాలువ బాగుచేత చేపట్టారు. పొక్లెయిన్‌తో పూడిక తొలగించి నీటి ప్రవాహం సవ్యంగా సాగేలా చేసుకున్నారు.

కైకలూరు పంచాయతీ కథ కంచికి చేరేనా?

- నేడు తాత్కాలిక సర్పంచ్ ఎన్నిక
- ఈ నెల 19న సర్పంచ్ నవరత్నకుమారి సస్పెన్షన్
- 6 నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు జీతాల్లేవ్
- సర్పంచ్, వార్డు సభ్యుల మధ్య వివాదం



వివాదాలకు కేంద్ర బిందువుగా మారిన కైకలూరు పంచాయతీ కార్యాలయం

కైకలూరు: కయ్యాలమయంగా మారిన కైకలూరు మేజర్ పంచాయతీ కథ కంచికి చేరే కదలిక వచ్చింది. సర్పంచ్ వర్సెస్ వార్డు సభ్యుల ప్రచ్ఛన్న యుద్ధం ముగింపు దశకు చేరింది. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో బుధవారం కైకలూరు పంచాయతీలో తాత్కాలిక సర్పంచ్‌ను ఎన్నుకోవడానికి అధికారిక జీఓను సోమవారం విడుదల చేశారు. సర్పంచ్ రిజర్వేషన్ సామాజికవర్గానికి చెందిన వార్డు సభ్యుల్లో ఒకరికి అవకాశం ఇవ్వాలని జీఓలో పేర్కొన్నారు. ఎవరూ ముందుకు రాకపోతే వార్డు సభ్యుల్లో ఎవరినైనా సభ్యుల సమ్మతితో ఎన్నుకోవచ్చని తెలిపారు. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా సర్పంచ్ ఎన్నిక చర్చనీయాంశమైంది.

అసలేం జరిగిందంటే..

కైకలూరు మేజర్ పంచాయతీకి 2021 ఫిబ్రవరి 13న ఎన్నికలు జరిగాయి. ఎస్సీ రిజర్వ్‌డ్ కోటాలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు భార్య దానం మేరీ నవరత్నకుమారి వైఎస్సార్ సీపీ మద్దతుతో గెలిచారు. తదనంతరం వార్డు సభ్యులతో స్వల్ప వివాదాలు మొదలయ్యాయి. ఇదిలా ఉంటే 2024 ఎన్నికల్లో ఆమె వైఎస్సార్ సీపీని వదిలి బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ గెలుపునకు ప్రచారం చేశారు. కూటమి పార్టీలోనూ ఆమె ఇమడలేకపోయారు. సర్పంచ్ నిధులు దుర్వినియోగం చేశారని వార్డు సభ్యులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. పలు పర్యాయాలు విచారణలు జరిగాయి. సర్పంచ్ సైతం వార్డు సభ్యులపై కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ముందుగా సర్పంచ్ చెక్‌పవర్ రద్దు చేశారు. తర్వాత రూ.4,04,29,431 లెక్కలు నిమిత్తం సర్పంచ్‌ను 6 నెలల పాటు ఈ నెల 19న జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు. దీంతో పరిపాలనలో భాగంగా తాత్కాలిక సర్పంచ్ ఎన్నిక అవసరమైంది.

వివాదాలతోనే సరి

కైకలూరు పంచాయతీ 1934లో ఏర్పడింది. మొదటి సర్పంచ్‌గా మహ్మద్ గాలిబ్ సాహెబ్ చేశారు. ఇప్పటి వరకు 15 మంది సర్పంచ్‌లుగా పనిచేశారు. ప్రస్తుత పాలకవర్గం మధ్య జరిగిన విభేదాలు గతంలో ఎన్నడూ జరగలేదని పెద్దలు చెబుతున్నారు. ఇక్కడ 20 వార్డులకు గాను 10వ వార్డు సభ్యుడు, ఉపసర్పంచ్ మంగినేని పోతురాజు, 17వ వార్డు సభ్యుడు పెద్దింటి మురళీధరరావు అనారోగ్య కారణాలతో మరణించారు. మిగిలిన 18 మంది వార్డు సభ్యుల్లో 12 మంది సర్పంచ్ రత్నకుమారికి వ్యతిరేకంగా రాజీనామాలు సైతం సమర్పించారు. ఇదిలా ఉంటే కొద్దికాలం క్రితం వచ్చిన పంచాయతీ ఈఓ ప్రత్తిపాటి ఆనందభూషణానికి సర్పంచ్‌నకు గదిలో కుర్చీ వివాదం జరిగింది. చివరకు సర్పంచ్ భర్త, ఈఓ కొట్టుకునే స్థాయికి వెళ్లారు. ఈఓ ఇటీవల బదిలీపై వెళ్లారు. ప్రస్తుత పరిస్థితుల్లో పారిశుద్ధ్య కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు లేవు. పంచాయతీలో అభివృద్ధి పనులు సైతం జరగడం లేదు.

ఆరు నెలల కోసం ఆరాటం

వాస్తవానికి పంచాయతీల పాలన కేవలం ఆరు నెలలు కూడా లేదు. పైగా ప్రత్యేకాధికారులు వచ్చేస్తారు. ఇటువంటి తరుణంలో తాత్కాలిక సర్పంచ్‌ను ఎన్నుకుంటున్నారు. గతంలో రాష్ట్రం మొత్తం ఉపసర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్‌లో కైకలూరు లేదు. తర్వాత 15వ వార్డు సభ్యుడు కేవీఎస్ఎం.నాయుడుని ఉపసర్పంచ్‌గా వార్డు సభ్యులు ఎన్నుకున్నారు. కాగా ప్రస్తుతం తాత్కాలిక సర్పంచ్ ఎన్నిక ఏ మలుపు తిరుగుతుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు

వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్



ముదినేపల్లి మండలానికి చెందిన నాయకులను అభినందిస్తున్న డీఎన్నార్

కైకలూరు: పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పిస్తున్నారని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) మంగళవారం అన్నారు. కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లి మండలానికి చెందిన పలువురు ఇటీవల ఏలూరు జిల్లాలో వివిధ అనుబంధ విభాగాలకు సంబంధించి పలు హోదాల్లో పదవులు పొందారు. వీరిలో తలారి శివాజీ, బేతపూడి వెంకటరమణ, షేక్ అల్లా బక్షు, వెంట్రప్రగడ ఎకో ప్రదీప్, పేరే రామకృష్ణ, రంగిశెట్టి నరసింహారావు(కొండా), గొంతువులి సుమంత్, సామనపూడి సుధాకర్, కోటే ప్రవీణ్, మంగినేని బాజ్జి, పల్లి శ్రీధర్ ఉన్నారు. వీరిని జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్ అభినందించారు. క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి, ముదినేపల్లి మండలం ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి డీఎన్నార్ పరామర్శ



గోపాలకృష్ణతో మాట్లాడుతున్న డీఎన్నార్

కైకలూరు: ఇటీవల గుండె శస్త్రచికిత్స చేయించుకున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మండవల్లి మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణను ఆయన ఇంటిలో మంగళవారం వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పరామర్శించారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాలకు హాజరుకావాలని కోరారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ బలే నాగరాజు, నాయకులు సమయం రామాంజనేయులు, బుసనబోయిన శ్రీనివాసరావు, పంజా నాగు, కన్నా బాబు, ఏడుకొండలు, బలే శ్రీనివాసరావు, రామ్మోహన్‌రావు, మోరు కొండలు, రాంబాబు తదితరులు ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు



మల్లాయపాలెం పల్లెనిద్ర కార్యక్రమంలో సీఐ, ఎస్ఐ

గుడివాడరూరల్: గుడివాడ తాలూకా సర్కిల్ పరిధిలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని గుడివాడ తాలూకా సీఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని మల్లాయపాలెంలో సోమవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ధైర్యం కలిగించేందుకే పోలీస్‌శాఖ పల్లెనిద్ర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో భాగంగానే తాము పాల్గొన్నామని వివరించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు. గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించరాదన్నారు. ఆయా గ్రామాల్లో ఎక్కడైనా గంజాయి, మాదక ద్రవ్యాలు ఎవరైనా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ ఇందిర



అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు ఆంజనేయులు

మొవ్వ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో హాజరు కాకపోవటంతో మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశం ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా ముఖ్య అతిథిగా హాజరవుతారని సభ్యులు గంటకు పైగా వేచి ఉన్నారు. ఎమ్మెల్యే రాకపోవటంతో సమావేశం ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమావేశంలో పలువురు సభ్యులు ప్రధాన సమస్యలపై అధికారులను నిలదీశారు. వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో డీఏపీ, యూరియా కొరత ఉందని తెలిపారు. పీఏసీఎస్‌ల్లో అందుబాటులో లేని ఎరువులు బయట మార్కెట్‌లో ఎక్కువ ధరకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. అధికారుల లెక్కల్లో ఉన్న స్టాక్ వాస్తవానికి క్షేత్ర స్థాయిలో ఉండటం లేదని ఎంపీటీసీ సభ్యుడు సమ్మెట ఆంజనేయులు, సర్పంచ్ పెనుమూడి రమేష్ అధికారులను నిలదీశారు.

దమ్ము ట్రాక్టర్లతో రహదారులు ధ్వంసం

దమ్ము ట్రాక్టర్లు ప్లేట్లు వేసుకోకుండా తిరగడంతో రహదారులు ధ్వంసం అవుతున్నాయని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు వేమూరు పరిశుద్ధరాజు సభ దృష్టికి తెచ్చారు. పలు గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పనులు తూతూమంత్రంగా చేశారని, భవిష్యత్‌లో నాణ్యమైన పనులు నిర్వహణకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. పెడసనగల్లు శివారు ధర్మాపురంలో ఉండే బుడగ జంగం కులస్తులకు కుల సర్టిఫికెట్లు ఇవ్వాలని, ఆ ప్రాంతంలో శ్మశానానికి స్థలం కేటాయించాలని సర్పంచ్ కైతేపల్లి అన్నామణి తమ సమస్యను వెల్లడించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, డెప్యూటీ తహసీల్దార్ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పామర్రు(మొవ్వ): 33/11 కేయూ పామర్రు సబ్ స్టేషన్ పరిధిలోని చాట్లవానిపురం, సాయినగర్, కొండిపర్రు, శివాలయం వీధుల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం మూడు గంటల వరకు ఈ నెల 30, 31 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ గోవిందరావు తెలిపారు. పామర్రు టౌన్‌లో నేషనల్ హైవే పై కొత్త లైన్స్ వేయటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పెడసనగల్లు(మొవ్వ): విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కూచిపూడి ఎస్ఐ కేవీఎన్ విశ్వనాథ్ సూచించారు. మొవ్వ మండలం పెడసనగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈగల్ క్లబ్ సహకారంతో విద్యార్థులకు మంగళవారం మాదక ద్రవ్యాలతో వచ్చే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటసంజీవరావు, కూచిపూడి ఏఎస్ఐ టి.సురేష్‌కుమార్, ఈగల్ క్లబ్ కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు



ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అనేకమంది భక్తులు స్వామివారి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేసి, అభిషేకాలు చేయించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్.గంగాశ్రీదేవి పర్యవేక్షణ చేశారు.

యూరియా కొరత లేకుండా చూడండి



తోట్లవల్లూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న శివనాగేంద్రం, తదితరులు

తోట్లవల్లూరు: యూరియా కొరతను నివారించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కోసూరి శివనాగేంద్రం డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో కొద్దిసేపు నిరసన తెలిపి రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివనాగేంద్రం మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు యూరియా ఎక్కువగా అవసరం ఉందన్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా లేకపోవటం దారుణమన్నారు. పీఏసీఎస్‌ల వద్ద రైతులు గంటల తరబడి నిలబడితే రెండు బస్తాల యూరియా మాత్రమే ఇవ్వటం అనేది ఆవేదన కలిగిస్తోందన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బ్లాక్ మార్కెట్‌లో యూరియా బస్తాను రూ.350 వరకు అమ్మి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. అధికారులు స్పందించి యూరియా కొరత లేకుండా చూడాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కంభం కొండలబాబు, సీపీఎం నాయకులు జుజ్జవరపు ఏసోబు, ఈదుపుగంటి డేవిడ్‌రాజు, అంబటి శ్రీనివాసరావు, కే. వెంకటేశ్వరరావు, రమేష్ పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడికి ఆర్థిక సాయం



కార్మికుడి కుటుంబానికి రూ.10వేలు అందజేస్తున్న యూనియన్ నాయకులు

గుడివాడరూరల్: గుడివాడ ఆటోనగర్ రెండో లైన్‌లో హైడ్రాలిక్ పని చేసి ఇంటికి వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురైన కార్మికుడికి ది గుడివాడ ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ మంగళవారం రూ.10వేలు సాయం అందజేశారు. పట్టణంలోని 28వ వార్డు వాంబేకాలనీకి చెందిన షేక్ రమీజ్ పని మునిగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో కాలు విరిగింది. ఈక్రమంలో యూనియన్ తరఫున ఆయన కుటుంబ సభ్యులకు రూ.10వేలు సాయం అందించినట్లు యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, కార్యదర్శి అబ్దుల్ ఖుద్దూస్, ఉపాధ్యక్షుడు బి.ఆంజనేయులు, కోశాధికారి ఆత్మూరి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పీ-4 మార్గదర్శకులుగా చేరండి



పీ-4 కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: పేదలను ఆదుకునేందుకు పీ-4 పద్ధతి సత్ఫలితాలనిస్తోందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ చెప్పారు. కైకలూరు సీతారామఫంక్షన్ హాల్లో కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో పీ-4 సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్యశాఖ డీడీ బి.నరసయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో కామినేని మాట్లాడారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 100 మంది పీ-4 మార్గదర్శకులుగా కొందరిని దత్తత తీసుకోడానికి ముందుకు వచ్చారన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, కూటమి నేతలు త్రినాథరాజు, వల్లభనేని శ్రీనివాసచౌదరి, జోగిరాజు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వదర్లపాడు గ్రామం నుంచి నరసాయిపాలెం వరకు నాబోర్డు నిధులు రూ.90 లక్షలతో నిర్మించే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయండి



సంతకాలు సేకరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కాజ(మొవ్వ): మొవ్వ మండలం కాజ గ్రామంలో స్మార్ట్ మీటర్ల రద్దు చేయాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ తిరిగి నాయకులు సంతకాలు సేకరించారు. ముఖ్యమంత్రికి సమర్పించే అర్జీ పై ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా స్మార్ట్ మీటర్ల స్థానంలో పాత మీటర్లు బిగించాలని, ప్రజలపై విద్యుత్ అదనపు చార్జీలు వెయ్యరాదని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు, కృష్ణా జిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు కోదాటి నారాయణరావు, సీపీఐ కాజ శాఖ కార్యదర్శి వెంకటేశ్వరరావు, సభ్యులు గౌరి సత్యప్రసాద్, కనకదుర్గరావు, సత్యనారాయణ, రామ్మోహన్‌రావు, సీఐటీయూ నాయకులు రావులపల్లి మురహరి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కొడాలి కరుణాకర్‌రావు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించండి



ఎంపీడీఓ ఇమ్రాన్‌కు తాగునీటి సమస్యను వివరిస్తున్న డాక్టర్ బండారు, గ్రామస్తులు

గుడ్లవల్లేరు: మండలంలోని చంద్రాల శివారు సింగలూరు గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆ గ్రామస్తులు మంగళవారం ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ నాయకత్వాన ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్‌కు వినతిపత్రాన్ని అందించారు. తమ గ్రామంలోని గ్రామ పంచాయతీ మంచినీటి చెరువుకు రక్షణ లేక పశువులు దిగుతున్నాయని చెప్పారు. ఆ చెరువును అధికారులు సర్వే చేయించినట్లు పేర్కొన్నారు. ఆ చెరువుకు ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గతంలో బోదె నుంచి కాకుండా కొత్తగా తాగునీటిని చెరువుకు వేరే బోదె నుంచి పంచాయతీ వారు అందిస్తున్నారని తెలిపారు. ఈ బోదెలో పొలం నుంచి వచ్చే మురుగు నీరంతా కలుస్తోందన్నారు. ఆ కారణంగా మంచినీరు కలుషితమైన చెరువులోకి చేరుతుందన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకుని తమ గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కోరారు. గ్రామస్తుల వినతికి స్పందించిన ఎంపీడీఓ చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు ఉద్దంటి నాగ మల్లేశ్వరరావు, మాచర్ల రమణయ్య, తుమ్మలచర్ల లక్ష్మణరావు, బిట్రా అర్జునరావు, కోట పైడేశ్వరరావు, దోనేపూడి ప్రసాద్, ఆకురాతి హనుమంతరావు, నెమలి రాజా, నందం రమణ, మాచర్ల పెద్దిరాజులు, ఆకురాతి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



మర్రివాడలో మాట్లాడుతున్న డీఎస్పీ ధీరజ్ వినీల్

పమిడిముక్కల: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ సూచించారు. పల్లెనిద్రలో భాగంగా మర్రివాడలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. గ్రామంలో ఏవైనా సంఘటనలు జరిగితే పోలీసులకు తెలియజేయాలన్నారు. సోమవారం రాత్రి గ్రామంలోనే బస చేశారు. కార్యక్రమంలో సీఐ చిట్టిబాబు, ఎస్ఐ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

పమిడిముక్కల: ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మండలంలోని పలు గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. గురజాడలో మాధురికి రూ.20,000 మంటాడలో సాంబశివరావుకు రూ.85,509, నీలయ్యకు రూ.73,122, కపిలేశ్వరపురంలో షబ్బీర్‌కు రూ.31,192, అల్లాభక్షుకు రూ.30,524 అందజేశారు.

ముగిసిన వార్షిక ఆగమన మహోత్సవాలు



పమిడిముక్కల: మంటాడ శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో రెండు రోజులుగా జరుగుతున్న వార్షిక కల్యాణ మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. స్వామి వారి సమష్టి కల్యాణం అత్యంత వైభవంగా జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి కల్యాణంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆలయ ఈఓ దుర్గానాగేశ్వరరావు, వంశపారంపర్య ధర్మకర్త రామ్మోహనరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు సత్కారం

పమిడిముక్కల: ఐనపూరు సచివాలయంలో ఐదేళ్లు పనిచేసి ఇటీవల జరిగిన బదిలీల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లిన ఉద్యోగులను మంగళవారం సర్పంచ్ కొండా జయలక్ష్మి దంపతులు సత్కరించారు. వృత్తిపట్ల అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. కార్యదర్శి స్వామి, గ్రామ పెద్దలు బసివిరెడ్డి, గోపాలరెడ్డి, అప్పిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.